# 11

# ఫిలిప్పీయులకు: ప్రభువునందు ఆనందించుట

### శీర్షిక

ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక దానిని పొందినవారి పేరుతోనే పిలువబడింది. ఈ రచన ప్రత్యేకించి, ఫిలిప్పీ పట్టణమునందున్న క్రైస్తవులకు అడ్రస్ చేయబడింది (1:1).

### పూర్వ చరిత్ర

తన రెండవ సువార్త ప్రయాణంలో, "మాసిదోనియా పిలుపుకు" బదులుగా (అపొస్తలుల కార్యములు 16:9, 10), పౌలును అతని జత పనివారును ఫిలిప్పీకి బయలుదేరారు. ఇది రోమీయుల ప్రవాసమును మాసిదోనియలో ఒక ప్రాముఖ్యమైన పట్టణమైయుంది (ఇప్పుడు అది గ్రీసు దేశంలో ఉత్తరపు భాగమైయుంది). అంత పెద్దది కాకపోయినా, ఫిలిప్పీ పట్టణానికి చారిత్రక ప్రాధాన్యత ఉంది. అది మనకు ఎలా తెలుసునంటే, పౌలు అక్కడికి సువార్తతో వెళ్లాడు. అపొస్తలుల కార్యములు 16 పౌలు అక్కడ చేసిన కొంత పనిని తెలుపుతోంది: లూదియాయు ఆమె యింటివారును మార్పు చెందారు, దయ్యముపట్టిన బాలిక బాగుచేయబడింది, చెరసాల నాయకుడు మార్పు పొందాడు.

పౌలు ఫిలిప్పీని విడిచిపెట్టిన తరువాత, అక్కడున్న నూతన క్రైస్తవులతో సన్నిహితమైన బాంధవ్యాలు నిలుపుకున్నాడు. తాను వెళ్లిన చోట్లకెల్లను ఫిలిప్పీయులు పౌలుకు సపోర్టు పంపుతూ ఉండేవారు (1:5; 4:15, 16). తనకు వీలున్నప్పుడెల్ల వారిని సందర్శించడానికి అతడు ప్రయత్నించేవాడు; అతడు ఆ సంఘాన్ని ప్రేమించాడు (4:1). పౌలు రోములో చెరలో ఉన్నప్పుడు, అతడు పలు "చెర పత్రికలు" వ్రాశాడు ("ఎఫెసీయులకు: క్రీస్తు ఆయన సంఘము" అనే వ్యాసం చూడు). క్రీ.శ. 60–62లో శ్రమపడుతున్న ఫిలిప్పీలో ఉన్న సంఘానికి వ్రాసిన పత్రిక చెర పత్రికలలో ఒకటి (1:1, 7, 13, 14; 4:22).

రోమీయులకు వ్రాసిన పత్రికవలె ప్రాథమిక క్రైస్తవ సత్యాలను వ్రాయటానికి ఉద్దేశించిన పత్రికలాంటిది కాదు యిది. కొరింథీయులకు వ్రాసిన పత్రికవలె సిద్ధాంతపరమైన లేక నైతికపరమైన దోషాలను దిద్దడానికి ఉద్దేశించి వ్రాసింది కాదు. అయితే యిది ఒక వ్యక్తిగతమైన ఉత్తరం.

దీన్ని వ్రాయడానికి కనీసం నాలుగు కారణాలున్నట్టు పౌలు ప్రస్తావించాడు. అతడు రోములో ఉండగా వారతనికి సహాయం పంపారు (1:5; 2:25నుండి; 4:10, 14, 18), అతడు వారికి వందనాలు చెప్ప కోరాడు. రెండవది, ఎపఫ్రొదితుచే సహాయం

పంపబడింది (2:25; 4:18), చావ సిద్ధమగునంతగా అతడు రోగి అయ్యాడు (2:25-30), ఈ విషయంలో వారి మనస్సులకు నెమ్మది కలిగించ గోరాడు. మూడవది, తిమోతిని వారి యొద్దకు శీఘ్రముగా పంపగోరిన విషయము, తాను వారిని సందర్శించాలనే దీర్ఘ కాలంగా ఉన్న తన ఆలోచనను వారికి ఎరుక చేయగోరాడు (2:19-23; 1:26; 2:24; ఫిలేమోను 22 చూడు). నాల్గవది, ప్రేమ, ప్రోత్సాహము, క్షేమాభివృద్ధికి సంబంధించిన సందేశాన్ని అతడు వారికి పంపగోరాడు.

పలు అంశాలు దీనిగుండా వెళ్లతాయి. వాటిలో ప్రధానమైనది సంతోషించడమనే చర్చనీయాంశం (4:4-7). "సంతోషము," "ఆనందించుట" అనే మాటలు ఈ రచనలో కనీసం పదహారు సార్లు కన్పిస్తాయి. "అనుకూలమైన మానసిక స్వభావం" కలిగి ఉన్నందున కలిగేది కాదు. కాని ఇది *క్రీస్తునందలి* ఆనందం. "క్రీస్తునందు" లేక దానికి సమానమైన ప్రయోగాలు ఈ రచనలో 19 సార్లు కన్పిస్తాయి. నీవు ఈ పుస్తకాన్ని చదువుతుండగా, "సిలువ వేయబడిన యేసుక్రీస్తు" అనే రెఫరెన్సు కొరకు చూస్తూ ఉండు.

**అవుట్‌లైన్**

ఫిలిప్పీయులకు అనేది వ్యక్తిగతమైన ఉత్తరమైయుండగా, దానికి సంబంధించి ఏ అవుట్‌లైన్ అయినా అవసరమును బట్టియు, కృత్రిమంగా ఉంటుంది. ఒక ప్రామాణికమైన అవుట్‌లైన్ క్రీస్తుమీద కేంద్రీకరించబడింది: అధ్యాయం 1: క్రీస్తు మన *ఉద్దేశమైయున్నాడు* (1:21). అధ్యాయం 2: క్రీస్తు మన *మాదిరియైయున్నాడు* (2:5). అధ్యాయం 3: క్రీస్తు మన *బహుమానమైయున్నాడు* (3:13, 14). అధ్యాయం 4: క్రీస్తు మన *అవసరము తీర్చువాడైయున్నాడు* (4:13, 19). అందులోని విషయాల జాబితా యిక్కడ ఉంది.

I. పౌలు యొక్క వందన వచనం (1:1, 2).

II. కృతజ్ఞతాస్తుతులు చెల్లించుట, ఫిలిప్పీయుల కొరకు ప్రార్థన (1:3-11).

III. పౌలు బంధకాలను గూర్చి మరియు సాధారణంగా శ్రమలపై అంతర్ దృష్టి (1:12-30).

IV. క్రీస్తువలె వినయంగా, విధేయతగా ఏకమైయుండుటకు ప్రోత్సాహం (2:1-18).

V. భవిష్యత్తులో తిమోతిని పంపుటకు సంకల్పించుకొనుట, వెంటనే ఎపఫ్రోదితును పంపాలనే ఆలోచన (2:19-30).

VI. అబద్ధ బోధకులను హెచ్చరించుట; దానికొరకు అనుసరించవలసిన మాదిరి పౌలైయున్నాడు (3).

VII. ఏకత్వము, ఆనందము, సరియైన ఆలోచనను గూర్చి పలు హెచ్చరికలు (4:1-9).

VIII. వారి ఈవి కొరకు కృతజ్ఞత, సంతృప్తికరముపై ఉపదేశం (4:10-19).

IX. ముగింపు: వ్యక్తిగతమైన వందన వచనం, దీవెన (4:20-23).

**ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రికనుండి పాఠాలు**

ఈ రచనలో *ఆనందం* నొక్కి చెప్పబడినా, అది "అనుకూలమైన మానసిక స్వభావం నుండి" కలిగింది కాదు. క్రైస్తవులకు ఉండవలసిన అనుకూల స్వభావానికి సంబంధించిన బహు ఉత్తమమైన విషయం ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రికలో ఉంది (2:5; 3:13, 14; 4:4-8).

"నన్ను బలపరచువానియందే నేను సమస్తమును చేయగలను" (4:13) అనేది మనలో ఎక్కువ మంది తరచుగా వినియుండవచ్చు. దీనిని సాధారణమైన సత్యంగా ఉపయోగించవచ్చు. పౌలు ఈ మాటలు వ్రాసినప్పుడు, తన మనస్సులో ఏదో ప్రత్యేకమైనది ఉంది. తన శరీరపు పరిస్థితి, ఆర్థిక పరిస్థితి ఎలాగున్నా, సంతుష్టి కలిగియుండ అతడు నేర్చుకున్నాడు (4:11, 12). క్రీస్తు ద్వారా మనం సంతుష్టి కలిగియుండ నేర్చుకోగలం.

"క్రీస్తునందు" అనే ప్రయోగంలో గుప్తమైయున్నదాని విషయంలో పండితులు పెనుగులాడారు. కొన్ని తర్జుమాలు "క్రీస్తుతో ఏకత్వము" లేదా "క్రీస్తు శరీరమందు" అని వివరించాయి. ఉన్నపాటునే అది చదవబడడం ఉత్తమం. "క్రీస్తునందు *ఉండడమే*" యేసుతో దగ్గరగాను, సన్నిహితంగాను ఉన్న బాంధవ్యాన్ని వ్యక్తపరచే ఒకే విధానం.

ఈ ఉత్తరం సిద్ధాంతపరమైన రచన కాకపోయినా, క్రీస్తుయేసుకు సంబంధించిన ఒక రమ్యమైన భాగముంది: 2:5-11. ఇది ఆది క్రైస్తవ కీర్తనగా కొందరు తలంచారు. అది లోతైన లేఖన భాగం. స్వార్థ రహితంగా మనం యితరుల అక్కరల విషయమై అప్పగించుకోవాలనే సింపుల్ ఉద్దేశానికి పౌలు దీన్ని ఉపయోగించాడు. మనం అలా చేయుటకు యిష్టపడితే, ఒకానొక దినాన దేవుడు మనకు ప్రతిఫలమిస్తాడు!

---

## బంధకాలలో క్రీస్తునందు ఆనందించడం ఎట్లు
## (ఫిలిప్పీయులకు 1:3-11)

రోములో పౌలు సంకెళ్లచే బంధించబడియున్నాడు. తనకు తాను సానుభూతి కనుపరచుకొంటూ, ఫిర్యాదు చేస్తూ ఉండగలడు. కాని అతడు ఆనందించి, యితరులు కూడా ఆలాగే ఆనందించాలని కోరాడు (4:4-7). మనం భౌతికంగా బంధింపబడి యుండనవసరం లేదు. అయితే పలు సైజుల్లోను, జాడల్లోను మనమందరం సంకెళ్లు ధరించుకొంటాం: ఆరోగ్యం దెబ్బతింది, వివాహం యిబ్బందిగా మారిపోయింది, ఉద్యోగ సంబంధమైన ఒత్తిడులున్నాయి, పిల్లలు మన హృదయాలను పగలగొడుతున్నారు. పౌలు

తన బంధకాలలో ఎలా ఆనందంగా ఉండగలుగుతున్నాడు? మనం మన సంకెళ్లలో ఎలా ఆనందంగా ఉండగలం? "కృతజ్ఞతలు చెల్లించే" ఉత్తరంలోని ఈ భాగంలో అది ఎలాగో పౌలు మనకు తెలియజేస్తున్నాడు (1:3–11).

I. దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు గతాన్ని చూడు (1:3–5).
   A. ఫిలిప్పీ సంఘంతో గత పది సంవత్సరాలుగా తనకున్న సంబంధాన్ని గూర్చి పౌలు తలంచినప్పుడు, తనకు ప్రియమైన జ్ఞాపకాలు తప్ప ఏమీ లేదు!
      1. వారిని జ్ఞాపకం చేసికొన్నప్పుడెల్లా అతడు తన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తాడు (3 వ.)!
      2. *వారందరికొరకు* ఆనందంతో ప్రార్థించగలడు (4 వ.; "*మీరందరు*" అనే పదాన్ని 7, 8 వచనాలలో చూడు).
   B. పౌలు ఫిలిప్పీలో ఉన్నప్పుడు మంచి తప్ప మరేమీ జరుగలేదని గాని – ఫిలిప్పీలోని సంఘం పరిపూర్ణమైనదని గాని దీని అర్థమా? లేదు (4:2; అపొస్తలుల కార్యములు 16:16నుండి.).
      1. పౌలు వెనుకకు తిరిగి, దుఃఖకరమైన సంగతులను చూచినప్పుడు వాటినుండి మంచి ఉద్భవించుననే సంగతిని అతడు చూడగలిగాడు (రోమా 8:28).
         ఎ. అతనికి ఫిలిప్పీలో జరిగిన అవమానము చెరసాల నాయకుడి మార్పుకు దోహదమయ్యింది (అపొస్తలుల కార్యములు 16:16–34).
         బి. అతడు ఆ ప్రాంతమును విడిచినందున ఇతర స్థలాల్లో సువార్త ప్రకటించేలా సహకరించింది (అపొస్తలుల కార్యములు 16:39).
      2. వారిని గూర్చిన సద్విషయాలు గుర్తు చేసికొనడానికి పౌలు కోరుకున్నాడు.
         ఎ. ఆరంభంనుండి నేటివరకు వారు సువార్తలో "పాలుగలవారై" ఉన్నారు (5 వ.).
            (1) "పాలుపొందుట" [*koinonia*] అని తర్జుమా చేయబడిన పదం పౌలుకు ప్రాముఖ్యమైనది (1:7; 2:1; 3:10; 4:15). "కలిసి పంచుకొనడం," "పాలుపంపులు పొందడం" అని అర్థం.
            (2) ఉభయుల విశ్వాసాన్ని బట్టి, తమకు కలిగియున్నవాటిని ఫిలిప్పీయులు పౌలుతో పంచుకొంటున్నారు (4:10, 15, 16). మనం మిషినెరీలను సపోర్టు చేసినప్పుడు వారి ప్రయాసల్లో మనం పాలుగలవారమై ఉంటాం!

బి. జరిగిపోయిన చెడ్డ విషయాలమీద దృష్టిని కేంద్రీకరించి దుఃఖంలో మునిగి పోయినవారమై ఉండవచ్చు, లేదా సద్విషయాలను గుర్తు చేసికొని దేవునికి స్తుతి చెల్లించవచ్చు, ఆనందించవచ్చు.

II. ప్రస్తుతాన్ని దేవునియందలి నమ్మికతో చూడు (1:6–8).

A. ఫిలిప్పీలోని క్రైస్తవులను గూర్చి పౌలు ఆలోచించినప్పుడు, ప్రేమతోను (7, 8 వచనాలు), నమ్మికతోను నింపబడ్డాడు (6ఎ వ.)! నమ్మిక అనేది రచన అంతటిగుండా వెళ్లే చర్చనీయాంశమైయుంది. ("Confident" అనేదానికి గ్రీకు పదం ఆరుసార్లు వస్తుంది.) పౌలు ఎందుకు నమ్మిక కలిగియున్నాడు?

1. మొదటిగా, దేవుడు ఎవరైయున్నందున: దేవుడు మనలో కార్యసిద్ధి కలుగజేయువాడు (6బి వ.)!

ఎ. ఫిలిప్పీలో సంఘారంభమునకు ఘనత పౌలు తీసికోలేదు; ఈ సత్క్రియను దేవుడే ఆరంభించియున్నాడని పౌలు అన్నాడు!

బి. "దేవుడు దేనిని ఆరంభించినా, ఆయన దానిని ముగిస్తాడు" అని అతడన్నాడు!

2. రెండవది, ఫిలిప్పీయులు ఎవరైయున్నారో దానినిబట్టి: వారు పట్టువీడక ఉన్నందున దేవుడు వారి జీవితాలలో కార్యసిద్ధి కలుగజేయగలవాడైయున్నాడు (7, 8 వచనాలు).

ఎ. తమయందు పనిచేయడానికి దేవుడు పరిపూర్ణమైన జనులకొరకు చూడడం లేదు; తమ జీవితాలలో ఎవరు పని చేయనిస్తారో వారికొరకు ఆయన చూస్తున్నాడు.

బి. ప్రత్యేకించి, ఆయనపట్లను, సువార్తపట్లను, కృపపట్లను వారికున్న సహవాసాన్ని పౌలు ప్రస్తావించాడు (7 వ.).

(1) సువార్తపై దాడి జరిగినప్పుడు, దాని పక్షంగా వారు పోరాడనిష్టపడ్డారు.

(2) పౌలు చెరలోనున్నప్పుడు, వారు వెనుకకు తిరుగలేదు (2 తిమోతి 1:8), కాని అతనికి సహాయం చేశారు.

B. మనకు పని ఏమైయున్నా, మనం నమ్మకమైన క్రైస్తవులమైయుంటే, ఆ పని సరియైనది. మనం ఒంటరిగా దాన్ని ఎదుర్కోలేము. దేవుడు మన జీవితాలలో ఎల్లప్పుడు పని చేస్తూ ఉంటాడు (2:13; ఎఫెసీయులకు 3:20 చూడు).

III. దేవునిని ప్రార్థిస్తూ భవిష్యత్తువైపు చూడు (1:9, 10).

A. "ఒకడు భవిష్యత్తువైపు ఆశతో ఎదురు చూడవచ్చు లేక నిరాశతోను

ఎదురు చూడవచ్చు." జీవిత వాస్తవాలను పౌలు అలక్ష్యం చేసినవాడు కాడు. ఫిలిప్పీయులు సవాళ్లను ఎదుర్కోవలసి వస్తుందని పౌలు ఎరుగు. అతని పరిష్కారము ప్రార్థన! ప్రభువునందు ఫిలిప్పీయులు అభివృద్ధి కావాలని అతడు ప్రార్థించాడు:

1. దైవ ప్రేమయందు *(agape)* ఎదుగునట్లు (9ఎ వ.).
2. దేవుని వాక్య జ్ఞానమునందు ఎదుగునట్లు (9బి వ.).
3. మేలు కీడులకు మధ్య నిర్ణయించుకోగల సామర్థ్యమందు ఎదుగునట్లు (9బి; 10ఎ; హెబ్రీయులకు 5:14 చూడు).
4. క్రైస్తవ శీలమునందు ఎదుగునట్లు (10బి వ.).
5. "ఫలభరితమైన" జీవితం జీవించునట్లు (11ఎ వ.; యోహాను 15:8; గలతీయులకు 5:22, 23 చూడు).

B. భవిష్యత్తును మనం నమ్మికతో ఎదుర్కొన్నట్టయితే, శక్తి వంచన లేకుండ జరిగించ పూనుకుందాం:

1. అనుదినము దేవునితో సన్నిహితంగా ఉండునట్లు (11బి వ.) జీవించుదాం. ఆయనయందు నిలిచియుందాం. "ఎవడు నాయందు నిలిచియుండునో నేను ఎవనియందు నిలిచియుందునో వాడు బహుగా ఫలించును; నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరు" అని క్రీస్తు ప్రభువు అన్నారు (యోహాను 15:5బి).
2. అన్ని విషయములలో దేవుని మహిమపరచడం (11బి వ.). మత్తయి 5:15, 16 యిలా అంటుంది, "మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారియెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి."
3. క్రీస్తు వచ్చినప్పుడు సమస్తము మేలుగా మారుతుందని ఎరిగి (6, 10 వచనాలు), భవిష్యత్తును దేవుని చేతికి అప్పగించు!

ముగింపు

భవిష్యత్తును దిగులుతో గుర్తు చేసికోవచ్చు లేదా కృతజ్ఞతతో జ్ఞాపకం చేసికోవచ్చు. ప్రస్తుతాన్ని మనం భయముతో చూడవచ్చు లేదా నమ్మికతో చూడవచ్చు. భవిష్యత్తును రాబోవు కీడును చూచి భీతిల్లుతూ ఎదుర్కోవచ్చు లేదా ప్రార్థనతో ఎదుర్కోవచ్చు. మన సొంత శక్తిమీద మనం ఆనుకోవచ్చు లేదా దేవునిమీద ఆధారపడ నేర్చుకోవచ్చు. ఒకటి విషాదానికి నిశ్చయమైన సూత్రము; మరొకటి ఆనందానికి దేవుని సూత్రం.